“ఇంకా కావాలి అంటే అడుగుతున్నాడు సార్. అందుకే మీకు కంప్లయింట్ యివ్వడానికి ఫోన్ చేసాను సార్” గుక్కతిప్పుకోకుండా చెప్పాడు బుచ్చిబాబు.

“ఓ...అట్టానా? వాడి గురించి వేరే కంప్లయింట్స్ నాన్దా రిసీవ్ సేస్కుంటిని.......వాడి సంగతి నేను సూస్తును” అన్నాడు నటరాజన్ అవతలి నుండి.

“థాంక్స్!” అని రిసీవర్ పెట్టేసి కసిగా నవ్వాడు బుచ్చిబాబు.

0 0 0

“ఊ....ఏంది విష్యం?” తనముందు నిల్చునివున్న ఏకాంబరాన్ని క్రిందినుండి పైకి పై నుండి క్రిందికి చూస్తూ ప్రశ్నించాడు మినిష్టర్ మిన్నారావు. ఏకాంబరం తన చేతిలోని కాగితాన్ని మినిష్టర్ మిన్నారావుకి ఇచ్చాడు.

“ఏమిటిది?” అడిగాడు మిన్నారావు.

“రిప్రజెంటేషన్ సార్!” వినయంగా అన్నాడు ఏకాంబరం.

“ఇట్టా కాగితాలిస్తే నాకేంటి తెలుస్తది? నాకు సదవడంరాదు. అదేదో వివరంగా నువ్వే సెప్పు”.

“నేను గుంటూరుకి ట్రాన్స్ఫర్ కావాలి సార్!”

మినిష్టర్ మిన్నారావు సర్రున లేచాడు.

“ఏందమ్మా ఇదీ? నేను పనీ పాటా లేనోడిననుకున్నావా? నీ ట్రాన్స్ఫర్ విషయాలు సూడ్డానికే నేను మంత్రినయ్యాననుకున్నావా? దేశంలో ఎన్ని సమస్యలున్నాయ్ ఏటి కత ? ఎల్లెల్లు”

“అది కాదుసార్.... నేను ఎన్నో సంవత్సరాలుగా నా సొంతవూరికి దూరంగా ఇక్కడ పడివున్నా సార్. ఎంతోమంది కిల్లారికిత్తిగాళ్ళకి సహాయం చేస్తుంటారు. నాకుకూడా సహాయం చెయ్యండి సార్!” బ్రతిమలాడుతూ అన్నాడు.

“ఈల్లేదని సెప్పాకదా? ఇప్పుడు నేను అర్జంటుగా పందుల పెంపకం కేంద్రానికి ప్రారంభోత్సవం సెయ్యడానికి వెళ్ళాలి. నన్ను డిస్టర్బంగ్స్ సెయ్యకుండా వెళ్ళిపో” సోఫాలోంచి గబ్బుక్కున లేచాడు మినిస్టరు మిన్నారావు.

ఏకాంబరానికి అర్థం అయిపోయింది ఆ కిల్లారికిత్తిగాడు ఇక తన మాట వినడని.

ఇక బుచ్చిబాబు చెప్పినపని చెయ్యడం ఒక్కటే మార్గం!

ఏకాంబరం తన చంకలో చుట్టచుట్టి పెట్టుకున్న పాత న్యూస్ పేపరున తీసి మినిస్టరు మిన్నారావువైపు చూపుతూ “ఇది చూడండి సార్” అన్నాడు.

“యేముంది అందులో?” అడిగాడు మినిస్టరు మిన్నారావు ఏకాంబరాన్ని అయోమయంగా చూస్తూ.

“యేమో...సార్....మీరే చూసి చెప్పాలి! నాకేం తెలీదు?” అన్నాడు ఏకాంబరం.

నిజానికి ఏకాంబరానికి ఆ న్యూస్ పేపరు ప్రత్యేకత ఏమిటో తెలీదు. ఆ తేదీ న్యూస్ పేపరుని మినిస్టరు మిన్నారావుకు చూపిస్తే పనవుతుందని బుచ్చిబాబు చెప్పాడు, ఎందుకువుతుంది ఎలా అవుతుంది అన్న విషయం ఏకాంబరానికి తెలీదు.

మినిస్టరు మిన్నారావు ఏకాంబరం చేతిలోంచి న్యూస్ పేపర్ అందుకుని చూసి వెంటనే కెవ్వుమని కేకేసాడు. అతని మొహం పాలిపోయింది.

అది రాజేంద్ర హత్యకి సంబంధించిన న్యూస్ పేపర్. అంటే బుచ్చిబాబు ఆ హత్యా రహస్యం వీడికి చెప్పేశాడా? వీడిప్పుడు నన్ను బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడా?

“సార్!” గావుకేక పెట్టాడు మినిస్టర్ మిన్నారావు.

ఏకాంబరం కంగారుగా వెనక్కి తిరిగి చూశాడు. తన వెనకగానీ ఎవరయినా ఉన్నారేమోనని!

“మిమ్మల్నే సార్...కూర్చోండి సార్” జుట్టు పీక్కుంటూ బాధగా అన్నాడు మినిస్టర్ మిన్నారావు.

“సార్ మీరలా టింగాల టిస్కులా జుట్టు పీక్కోకండి సార్. నాకు బాధగా వుంటుంది. నేనలా కూర్చుంటా సార్” కంగారుపడుతూ అన్నాడు ఏకాంబరం సోఫాలోకూర్చుంటూ.

మినిస్టర్ మిన్నారావు కూర్చోలేదు.

“నన్ను సార్ అనకండి సార్! ఏవోయ్ అనో, ఒరేయ్ అనో అనండి సార్ తృప్తిగా వుంటుంది. ఇంతకీ మీరు ఏ ఆఫీసులో పని చేస్తున్నారు. ఎక్కడికి ట్రాన్స్‌ఫర్ కావాలి. ఆ ఇసయాలన్నీ వివరంగా సెప్పండి సార్” వినయంగా అన్నాడు మినిస్టర్ మిన్నారావు.

అయోమయంగానే అయినా వివరాలు చెప్పడం మొదలుపెట్టాడు ఏకాంబరం.

0 0 0

బుచ్చిబాబుకి ఎంతో సంతోషంగా వుంది. ఎందుకంటే సీత అతని ప్రక్కన పడుకుని వుంది. అతనికి సంతోషంగా మాత్రమే కాదు... హాయిగా...ఇంకా అదేదో ఇదిగా కూడా ఉంది.

అవును మరి... ఇన్నాళ్ళూ అతనూ, సీత కలిసి తిరిగారు. కబుర్లు చెప్పుకున్నారుగానీ ఎప్పుడూ ఇలా ప్రక్క ప్రక్కన పడుకోలేదు.

క్రితంరోజు రాత్రి సీత అతన్ని క్రిందికి తోసేసి తను వెళ్ళి చాప మీద పడుకుంది. ఆలా జరిగినందుకు సీత కూడా ఎంతో బాధపడింది. అయినా ఆమె సర్దుకోలేకపోతుంది.

పెళ్ళి కాకుండా అతని ప్రక్కన ఎలా పడుకోవడం?

బుచ్చిబాబు మోసం చేస్తాడని కాదు. అదోరకమైన ఇబ్బంది! బుచ్చిబాబు మనసులో మాత్రం ఏవేవే మధురమైన భావనలు!

క్రితం రాత్రి జరిగింది అతనా సమయంలో మర్చిపోయాడు. కిటికీలోంచి కళ్ళు మూస్కుని పడుకుని వున్న సీత మొహం మీద వెన్నెలపడి ఆమె అందానికి మెరుగులు దిద్దుతూ అతన్ని పిచ్చివాడిని చేస్తోంది. బుచ్చిబాబు కంట్రోల్ తప్పాడు.

చటుక్కున సీత నడుం చుట్టూ చెయ్యివేసి దగ్గరకు లాక్కుని ఆమె పెదాలమీద ముద్దు పెట్టుకున్నాడు.

సీత కళ్ళు తెరిచి అతని మొహంలోకి సూటిగా చూసింది. అంతే గానీ క్రితం రోజులా అతన్ని దూరంగా తోసెయ్యలేదు. బుచ్చిబాబుకి మరికాస్త ధైర్యం వచ్చింది. ఆమెని మరోసారి ముద్దు పెట్టుకున్నాడు.

మరోసారి....మరోసారి......

ఇంకోసారి.....

ఆమె మొహమంతా  ముద్దులతో నింపాడు.

"చాలా?" సీరియస్‌గా అడిగింది సీత .

"ఊహూ....చాలదు!" ఆమె సీరియస్‌నెస్‌ని గమనించేలేని మత్తులో వున్న బుచ్చిబాబు అన్నాడు.

"నాకు ఇష్టంలేదని చెవుతుంటే నీక్కాదూ? నీకు బుద్ధుందా అసలు?"

బుచ్చిబాబు పట్టు సడలింది.

"నువ్వు మనిషివేనా?" ఉక్రోషంగా అంది సీత .

బుచ్చిబాబు సీతని వదిలేసాడు.

అతని మత్తు పూర్తిగా దిగిపోయింది.

బుచ్చిబాబు కళ్ళమీది కన్నీటి పొరమీద వెన్నెల కిరణం తళుక్కున మెరవడం సీత గమనించనే గమనించింది.

0 0 0

వారం రోజులు గడిచిపోయాయి.

బుచ్చిబాబు, సీతకి మధ్య మాటలు లేవు ఆనాటి సంఘటనతో బుచ్చిబాబు మానసికంగా గాయపడ్డాడు. నీకు బుద్ధిలేదా, మనిషివికావా అని అన్న సీత మాటలు అతని అభిమానాన్ని దెబ్బతీసాయి.

సీతకి కూడా చాలా బాధ అనిపించింది బుచ్చిబాబుతో అలా ప్రవర్తించినందుకు. కానీ అలా అనకపోతే అతను ఆగేలా లేడు. ఇంకా....ఇంకా.....ఇంకా....ముందుకెళ్ళేలా వున్నాడు. పెళ్ళికాకుండా బుచ్చిబాబుతో శారీరక సంబంధం అనేది ఏవిధంగా ఆలోచించినా ఆమె మనసు అంగీకరించడంలేదు.

పుట్టినప్పటినుండీ మన సాంప్రదాయం, కట్టుబాటూ నరనరాన జీర్ణించుకుపోయిన అమ్మాయి అలాంటి విషయాన్ని ఎలా అంగీకరించగలదు?

అప్పుడు బుచ్చిబాబు బాధ చూళ్లేక అతనితోపాటు విజయవాడ వచ్చేసిందిగానీ ఆమె ఆ విషయంలోని లోటుపాట్ల గురించి క్షుణ్ణంగా అలోచించలేదు. తన ప్రవర్తనవల్ల బుచ్చిబాబు ఎంతగా గాయపడ్డాడో సీతకి తెలుసు.

అందుకే ఆమె తనే బుచ్చిబాబుని మాట్లాడించాలని ఎన్నోసార్లు ప్రయత్నించింది. కానీ బుచ్చిబాబు ఊ.....ఆ... అని తప్ప అంతకు మించి మాట్లాడ్డం లేదు.

బుచ్చిబాబు మాట ఎలా వున్నా సీతకి మరీ బోర్ కొట్టేస్తోంది. ఎందుకంటే బుచ్చిబాబు ఆఫీసుకెళ్ళి ఆఫీసు పనిలో పడి అన్నీ మర్చి పోతాడు. సీత ఒక్క ర్తే ఇంట్లో ఖాళీగా వుండి లేనిపోని ఆలోచనలతో సతమతమవుతూ వుంది.

ప్రస్తుతం సీత హాల్లో నేలమీద చాపేస్కుని పడుకుంటోంది. బుచ్చిబాబు బెడ్రూంలో మంచంమీద....

పరిస్దితి ఇద్దరికీ నరక ప్రాయంగానే వుంది.

వారం క్రితం ఆ సంఘటన జరిగిన వెంటనే బుచ్చిబాబు సుందర్‌కి వివరంగా ఉత్తరం రాసి అందులో తన బాధనంతా తెలుపుకుని నీవల్లే ఇలా జరిగిందని తిట్టనుకూడా తిట్టాడు. తన ఇంటి అడ్రస్ ఇచ్చి ఇటు వంటి పరిస్థితుల్లో తను ఏం చేయాలో కూడా సలహా ఇస్తూఉత్తరం రాయమన్నాడు.

అందుకే సీత కూడా రాధకి ఉత్తరం రాసి మానసికంగా తను అనుభవిస్తున్న బాధని అమెకి రాసింది. ఆ రోజు బుచ్చిబాబు ఆఫీసుకు ఓ అర్ధగంట ఆలస్యంగా వెళ్ళాడు. సీత వంట చెయ్యడం కాస్త ఆలస్యం అయింది అందుకు!

బుచ్చిబాబు ఆఫీసుకు వెళ్లేసరికి స్టెనో లిల్లీ సీట్లో కూర్చుని వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"ఏంటి? ఏమైంది?? వాళ్ళాయనకేమైనా సీరియస్సా?" మోహన్‌ని అడిగాడు బుచ్చిబాబు.

"ఆమెకసలు పెళ్ళి కాలేదు" చెప్పాడు మోహన్.

"అవునా? మరి ఎందుకేడుస్తోంది? మంగారావుగాడు హత్తిరి అంటూ ఏమైనా తిట్టాడా?"

"వాడెందుకు తిడ్తాడు. వాడికి కస్టమర్లంటే ఎంత ప్రేమో లిల్లీ అంటే అంతకు పదిరెట్లు ప్రేమ!"

"మరింకెందుకురా ఆ ఏడుపు సిల్లీగా?"

"అందుకే ఆ ఏడుపు! మంగారావుగాడికి పెంటకుర్రు ఊరికి ట్రాన్స్‌ఫర్ అయింది. అది మోస్ట్ అన్ ఇంపార్టెంట్ బ్రాంచ్. ఆక్కడ కస్టమార్లూ పై రాబడులూ ఏమీ ఉండవు."

"అహా నటరాజన్"

"ఏంటి? నటరాజన్నా! అంటే మన సీనియర్ ఎగ్జిక్యూటివా? అతనేనా వీడిని ట్రాన్స్‌ఫర్

చేసింది?" కుతూహలంగా అడిగాడు మోహన్.

బుచ్చిబాబు కంగారు పడ్డాడు.

"నటరాజన్ అని అన్నానా? అయితే పొరపాటున అని ఉంటాను. నేను ఆ దేవుడ్ని తలచుకున్నా!" అని కళ్ళు మూస్కుని.

"అహా నటరాజా....ఏమి నీ లీల?" అన్నాడు మళ్ళీ పరవశంగా.

"ఇందులో లీలేముందీ? వీడి గురించి హెడ్డాఫీసుకి ఎవరో కంప్లయింట్ ఇచ్చి ఉంటారు.....వాళ్ళు వీడిమీద యాక్షన్ తీసుకుని ఉంటారు!"

"నేను మాత్రం కంప్లయింట్ ఇవ్వలేదు బాబోయ్..నాకేం తెలీదు!" అన్నాడు బుచ్చిబాబు భుజాలు తడుముకుంటూ.

"నిన్నిప్పుడు ఎవరన్నారయ్యా బాబూ" మోహన్ విసుక్కున్నాడు.

"ఇంతకీ ట్రాన్స్ఫర్ ఆర్డర్ ఎప్పుడొచ్చింది?"

"ఇప్పుడే...ఓ పావుగంట క్రితము! హెడ్డాఫీసు నుండి నటరాజన్ ఫోన్ కూడా చేసి ఈవేళ రిలీవ్ అయిపోయి రేపు పెంటకుర్రులో జాయిన్ అయిపోమని చెప్పాడంట!"

బుచ్చిబాబు మనసులో చాలా సంతోషించాడు వెధవకి మంచే శాస్తి అయ్యిందని. లిల్లీ అంతిదిగా ఏడుస్తుంటే పలకరించకపోతే బాగుండదని ఆమె దగ్గరకే వెళ్ళాడు బుచ్చిబాబు .

"ఊర్కోండి లిల్లీగారూ! ఊర్కోండి! మంగారావుగారు వెళ్ళిపోతున్నందుకు మీకు బాధకలగడం సిల్లీయేంకాదు. సహజమే! కష్టాలెప్పుడూ కలకాలము ఉండవు కొద్దిరోజుల్లో కొత్త మేనేజరు వస్తాడు. అతను మంగారావు కంటే మిమ్మల్ని ప్రేమగా చూస్కుంటాడేమో యెవరికి తెలుసు?" అన్నాడు బాధగా మొహంపెట్టి.

బుచ్చిబాబు వెనకాల నిలబడ్డ మోహన్ హవ్వ...హవ్వ అంటూ మూతిమీద కోట్టుకున్నాడు. లిల్లీ చివాలున తలెత్తి బుచ్చిబాబు వంక ఓసారి సీరియస్గా మింగేసేలా చూసి మళ్ళీ తలవంచుకుని కొంగు నోట్లో దోపుకుని 'ఊహూ....ఊహూ....' అంటు కుమిలిపోయింది.

ఇప్పుడు అనకూడనిది నేనేమన్నానని అలా మింగేసేలా చూసింది అని ఆశ్చర్యపోయాడు బుచ్చిబాబు. మంగారావుని కూడా పలకరించకపోతే బాగుండదని బుచ్చిబాబు అతని క్యాబిన్లోకి వెళ్ళాడు.

మంగారావు 'క్యార్....క్యార్' మని ఏడుస్తూ బుచ్చిబాబును గాఠిగా కౌగిలించుకుని "చూసావా బుచ్చిబాబు ... యెంత అన్యాయం అయిపోయిందో హత్తెరి" అన్నాడు వెక్కుతూ.

పెద్దవాళ్ళు చిన్నపిల్లల్లా ఏడవడమంటే ఇదే కాబోలు అనుకున్నాడు బుచ్చిబాబు. నిజంగా ఆ ట్రాన్స్ఫర్ బుచ్చిబాబూ, ఇంకా అలాంటి కొంతమందీ చేసిన కంప్లయింట్స్ వల్ల వచ్చిందని ఆ క్షణంలో మంగారావుకి తెలిస్తే బుచ్చిబాబుని పిసికి కిటికిలోంచి అవతలకి తోసేసి ఉండే వాడే!".

మంగారావ్ ఇంకా బుచ్చిబాబుని కౌగలించుకునే వెక్కసాగాడు.

“ఊరుకోండి సార్...ఊర్కోండి” మంగారావ్ వీపు మీద తట్టాడు బుచ్చిబాబు. “పెంటకుర్రు చాలా మంచి ఊరని విన్నాను సార్... అక్కడ చాలా రిచ్ కస్టమర్లు ఉంటారట ?” అన్నాడు.

ఆ మాట వినగానే మంగారావు బుచ్చిబాబు భుజము మీద నుండి మొహం తీసి తన రెండు చేతులూ బుచ్చిబాబు భుజాల మీద వేసి “అవునా? నిజంగానా?” అని సంతోషంగా అడిగాడు తన కన్నీళ్ళని ఆసనంద భాష్పాల్లోకి మార్చుకుంటూ.

“అవున్సార్. నిజం” అన్నాడు బుచ్చిబాబు.

మంగారావు అరచేతి వెనుక భాగంతో కన్నీళ్ళు తుడుచుకున్నాడు.

“వెధవా... అక్కడ నీకు ఒక్క కస్టమరూ తగల్డు. తగిలినా ఏకాంబరం వెధవా ఒక్క పైసా కూడా ఇవ్వడు” మనసులో కసిగా అనుకున్నాడు బుచ్చిబాబు.

మధ్యాహ్నం లంచ్ టైమ్‌లో మంగారావు రిలీవ్ అయి వెళ్ళిపోతే అక్కడికి కొత్త మేనేజరుగా ఎవరొస్తారన్న విషయం మీద స్టాఫ్ మధ్య చర్చ జరిగింది. ఒకరేమో ఢిల్లీ నుండి చుంచూలాల్ వస్తాడని అంటే మరికరేమో కలకత్తా నుండి కంగాళీ బెనర్జీ వస్తాడని అంటాడు. ఇంకొకడేమో బోంబాయి నుండి కంగార్‌కార్ వస్తాడని ఘంటాపథంగా చెప్పాడు.

ఇలా చాలా మంది చాలా రకాలుగా ఊహాగానాలు చేశారు. బుచ్చిబాబు లాంటి వాళ్ళయితే యెవరైతే ఏంటిలే....మనకి ఒరిగేది ఏమీలేదు అని సైలెంట్‌గా ఊర్కున్నారు.

ఆ సాయంత్రమే మంగారావుకి ఫేర్‌వేల్ పార్టీ జరిగింది. పార్టీ ప్రారంభంలోనే మంగారావు భోరున ఏడ్చాడు.

అతని ఏడుపు చూసి కొందరు సహృదయులు “ఊర్కోండి సార్.....ఊర్కోండి అక్కడా కూడా మీకు మంచి కస్టమర్లు దొరుకుతార్లే!” అని ఊరడించారు.

ఆ సహృదయుల్లో మంగారావు గురించి హెడాఫీసుకి ఆకాశరామన్న ఉత్తరాలు రాసినవాళ్ళు కూడా ఉన్నారు.